క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధితోనే ఉన్నతోద్యోగాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రకాష్‌రెడ్డి

తిరుపతి సిటీ: స్థానిక బైరాగిపట్టెడలోని రిమ్స్ కళాశాలలో సీనియర్ ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు వారం పాటు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అనే అంశంపై బుధవారం ప్రత్యేక సదస్సు ప్రారంభమైంది. ప్రిన్సిపల్ డాక్టర్ జే. ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచ స్థాయి పోటీల్లో రాణించాలంటే విద్యార్థులకు డిగ్రీలతో పాటు ఎంప్లాయిబిలిటీ స్కిల్ అవసరమన్నారు. అకడమిక్ విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించినప్పుడే ఉన్నతోద్యోగాలను సాధించగలరన్నారు. కార్యక్రమంలో శిక్షకులు యశ్వంత్, హెచ్‌ఓడీలు నిరంజన్‌రెడ్డి, పి.మధుర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు వృత్తి నైపుణ్య శిక్షణ



మహిళా సంఘాలకు శిక్షణ ఇస్తున్న వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక అక్కారంపల్లెకు చెందిన శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘాల సభ్యులకు వారం పాటు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రొఫెసర్ డి.సాయి సుజాత మాట్లాడుతూ, ఉన్నితో వస్త్రాలు, బొమ్మలు, ఫ్లవర్స్ మొదలైన వాటి తయారీపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కే.సుభాషిణి, వి.మురుగేష్, ధర్మేంద్ర కుమార్, సీకే.సరస్వతి, అధ్యాపకులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు

సీఆర్ రావు సేవలు చిరస్మరణీయం



వీసీని సన్మానిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ గణాంకశాస్త్ర విభాగం బుధవారం సీఆర్ రావు 105వ జయంతిని ఘనంగా నిర్వహించింది. సీడీ నాయుడు, ఆర్కాట్ లక్ష్మీకాంతమ్మ ఎండోమెంట్ ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఆర్‌రావు చిత్రపటానికి వీసీ సీహెచ్ అప్పారావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సీఆర్ రావు తన సేవలతో చిరస్మరణీయులని కీర్తించారు. విభాగాధిపతులు వీసీని జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్ వీవీరావు, గణిత విభాగం అధ్యాపకులు జయసుబ్బారెడ్డి, భారతి, సుగుణమ్మ, రాజనీతి శాస్త్రం అధ్యాపకులు మురళీధర్, అకడమిక్ కన్సల్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుయాలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రుయా అధికారులు, వైద్య విద్య, నర్సింగ్ విద్యార్థులు

తిరుపతి తుడా: స్థానిక రుయా ఆస్పత్రి మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి. వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బందితో కలిసి వైద్యులు రుయాలో ర్యాలీ నిర్వహించారు. ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జే.రాధ, మానసిక విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జునరావు, రోటరీ క్లబ్ సభ్యులు, సైకియాట్రి అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సినీ నటుడు శ్రీరామ్


తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం సినీ నటుడు శ్రీరామ్, అంబికా కృష్ణ దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

16 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ఆటో డ్రైవర్లు, ద్విచక్ర ద్విచక్ర వాహనదారులు 16 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచడంతో జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

సాధు కృషితో శ్రీవారి వైభవం విశ్వవ్యాప్తం

- వర్ధంతి సభలో ప్రముఖ శాసన పరిశోధకుడు కృష్ణారెడ్డి





మాట్లాడుతున్న కృష్ణారెడ్డి, సాధు సుబ్రమణ్యం శాస్త్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్: తిరుమలలోని శాసనాలను, అన్నమయ్య సంకీర్తనలను అనువదించి శ్రీవేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం కావడానికి కృషి చేసిన మహనీయుడు సాధు సుబ్రమణ్యశాస్త్రి అని తొండవాడకు చెందిన ప్రముఖ శాసన పరిశోధకుడు సారకాయల కృష్ణారెడ్డి స్మరించారు. అన్నమాచార్య కళామందిరంలో బుధవారం సాధు సుబ్రమణ్యశాస్త్రి 44వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన 'సాధు సుబ్రమణ్యశాస్త్రి పరిశోధనాదీక్ష' అనే అంశంపై ఉపన్యసించారు. శ్రీవారి ఆలయ పేష్కారుగా సాధు ఉంటూ 1,167 రాగిరేకుల శాసనాలను సేకరించి అనువదించడమే కాకుండా అన్నమయ్య కీర్తనల భాండాగారం నుంచి పలు రాగి రేకులను వెలికితీసి కీర్తనలను వెలుగులోకి తెచ్చారన్నారు. దేవస్థానం ఉద్యోగిగా మాత్రమే కాకుండా పురావస్తు పరిశోధనా శాస్త్రవేత్తగా అధిక భాగం సంకీర్తనలను శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించారన్నారు. అనంతరం ఎస్వీయూ వర్సిటీ సంస్కృత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శిరీష 'సాధు సుబ్రమణ్యంశాస్త్రి పరిశోధనలో శ్రీకృష్ణదేవరాయులు' అనే అంశంపై మాట్లాడారు. తొలుత శ్వేతభవనం ఎదురుగా నున్న సాధు సుబ్రమణ్యం శాస్త్రి విగ్రహానికి అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మేడసాని మోహన్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం గౌరి పెద్ది రామసుబ్బయ్య శర్మ 103వ జయంతి సందర్భంగా ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో శాస్త్రి కుమార్తె గిరిజ, జడ్జిగా ఉన్న ఆయన మనుమడు సీఎస్.మూర్తి, ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు లత, ప్రముఖ సాహితీవేత్త గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యార్థి విజ్ఞాన్..మంథన్'పై అవగాహన



విద్యార్థి విజ్ఞాన్, మంథన్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల: మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థి విజ్ఞాన్, మంథన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల సమన్వయకర్త వనపర్తి వెంకటసిద్ధులు మాట్లాడుతూ, అక్టోబర్, నవంబర్‌లో పాఠశాల స్థాయిలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రతిభా శోధన పరీక్షలపై విద్యార్థులు సంసిద్ధం కావాలన్నారు. అలాగే పరీక్షా విధి విధానాల బ్రోచర్, పోస్టర్, కరపత్రాలతో అవగాహన కల్పించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, గణితంతో పాటు భారతీయ శాస్త్రవేత్తల జీవిత కథలు, భారతదేశం శాస్త్రసాంకేతిక రంగాలలో చేసిన సేవలు, తార్కిక ఆలోచన ఇత్యాది అంశాలపై ఆన్‌లైన్‌లో పాఠశాల రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత అధ్యక్షతన ఉపాధ్యాయులు సుల్తాన్, ఆదికేశవులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వనరుల సద్వినియోగంతో లక్ష్య సాధన

- ఎస్వీయూ ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు మార్గదర్శనం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ ఇండక్షన్ ప్రోగ్రాం బుధవారం శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్‌డీవీ సుబ్బారావు, డీన్ ఆచార్య కే.మల్లికార్జునరావు, సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.నారాయణ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఎస్వీయూలో ప్రవేశాలు పొందడం అదృష్టమని, విద్యార్థులు ఇక్కడ ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాదాపు 400మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్పాహారం వితరణ



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సభ్యులు బుధవారం ప్రసూతి ఆసుపత్రి వద్ద గర్భిణులు, వారి సహాయకులకు అల్పాహారం వితరణ చేశారు. అలాగే 102 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ భాస్కర్, తిరుపతి గరుడాద్రి శాఖ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి చెన్నుపాటి చక్రపాణి, కోశాధికారి వి.పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, సభ్యులు ఎస్.రాజేంద్రప్రసాద్, రామారావు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'మిషన్ శక్తి సంకల్ప'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీ డీపీఓ జ్యోతి

రామచంద్రాపురం: మండలంలోని కుప్పం బాదూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏసీ డీపీఓ జ్యోతి మాట్లాడారు. లింగ వివక్ష, ఆరోగ్యం, ఆహార పరిరక్షణ-పరిశుభ్రత, వృత్తి సంబంధిత శిక్షణ నైపుణ్యాలపై ఆమె బాలబాలికలకు అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు ధైర్యంగా జీవించాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. బాదూరు మెడికలాఫీసర్ పూర్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, సుజనకుమారి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన డీఆర్‌ఎం



తిరుపతి రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్త

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతి రైల్వేస్టేషన్‌ను బుధవారం గుంతకల్ డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) చంద్రశేఖర్ గుప్త తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ లోపలి, బయట పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రైల్వేస్టేషన్ ఆవరణలో ఆధునీకరణ పనులు ఏ మేరకు చేస్తున్నారో పరిశీలించి సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. ఫైఓవర్ బ్రిడ్జిపై ప్రయాణికుల రాకపోకలను పరిశీలించారు. స్టేషన్ వద్దకు వాహనాల రాకపోకల సందర్భంగా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిజర్వేషన్ కార్యాలయ భవనంలో అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మాస్టర్ చిన్నపరెడ్డి, వివిధ విభాగాల అధికారులు, తిరుపతి, రేణిగుంట ఆర్‌పీఎఫ్, జీఆర్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాలకు ఆత్మహత్య పరిష్కారం కాదు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు, అధ్యాపకులు

తిరుపతి రూరల్: ఎవరికైనా కష్టాలు వస్తే కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలేగానీ ఆత్మహత్యలకు పాల్పడం పరిష్కారం కాదనేది గుర్తెరగాలని శ్రీబాలాజీ మెడికల్ కాలేజీ సైకియాట్రీ విభాగం నిపుణులు డాక్టర్.మాధవి అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం క్లినికల్ సైకాలజీ విభాగం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాధవితో పాటు సైకాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ అరుణ మాట్లాడారు. విద్యార్థి దశలో ఒత్తిడిని జయించే శక్తిని పెంచుకోవాలన్నారు. ఆత్మహత్య వల్ల కుటుంబీకులను క్షోభకు గురిచేయడమినహా సాధించేదేమీ ఉండదనేది గ్రహించాలన్నారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్.రజని, అధ్యాపకులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ లత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమాజ హితం 'మన్నవ' సాహిత్యం

-పంచ సహస్ర అవధాని మేడసాని మోహన్



మన్నవ ముత్యాలసరాలు, కనకదుర్గా శతకం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: అక్షరాలు మనిషిని జీవింపచేస్తాయని, సమాజ హితం కోరేదే సాహిత్యమని పంచసహస్ర అవధాని మేడసాని మోహన్ ఉద్ఘాటించారు. విశ్వశ్రీ సాహితీ సమాఖ్య, మన్నవ గురుపీఠం సంయుక్త ఆధ్వర్యంలో యూత్ హాస్టల్లో బుధవారం సాయంత్రం విశ్రాంత అధ్యాపకుడు మన్నవ భాస్కర నాయుడు జయంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేడసాని మాట్లాడారు. తన ఉన్నతికి గురువు మన్నవ భాస్కర నాయుడు ప్రోత్సాహం ఎంతో ఉందని వినమ్రంగా నివాళులు అర్పించారు. సభాధ్యక్షురాలు కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యను అందించడమే కాకుండా సమాజ శ్రేయస్సును కాంక్షించిన కవి, రచయిత మన్నవ భాస్కర నాయుడని ప్రస్తుతించారు. అనంతరం మన్నవ రచనలపై గాలి గుణశేఖర్, డాక్టర్ నెమలేటి కిట్టన్న విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. మన్నవ రచనల్లో సమసమాజ అభ్యున్నతి, సరళమైన భాష, సమకాలీన సంఘటనలను ఇతివృత్తంగా రచనలు చేశారన్నారు. తర్వాత ఆచార్య బాలసుబ్రమణ్యం, జక్కంపూడి మునిరత్నం, కోట వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు నాయుడు, గంగవరం శ్రీదేవి తదితరులు మన్నవ గురించి మాట్లాడారు. అనంతరం మన్నవ ముత్యాలసరాలు, కనకదుర్గా శతకం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, రచయితలు, కవులు మన్నవ గంగాధర ప్రసాద్, సాకం నాగరాజు, భూమన్, పేరూరు బాలసుబ్రమణ్యం, యువశ్రీ మురళి, అంకమ నాయుడు, తిరువాయిపాటి రాజగోపాల్, మల్లేశ్వర రావు, అమరేంద్ర, డాక్టర్ సుభద్ర, డాక్టర్ ఉమ, డాక్టర్ శోభ, ఉషారాణి, డాక్టర్ యువశ్రీ, ప్రసాద్, ఆర్.రమేష్, మోహన మునిసిద్ధారెడ్డి, వాకా ప్రసాద్, బత్తుల రవి, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చంద్రగిరి: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ లలితకుమారి అన్నారు. మండలంలోని ఐతేపల్లె జెడ్పీ హైస్కూల్లో బుధవారం మహిళా శక్తి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, హైస్కూలు బాలికలు తమ హక్కులతో పాటు ఫోక్సో చట్టం గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే దుష్ఫలితాలు, పోషకాహారం, రక్తహీనత సమస్యలు, కిశోర బాలికల్లో వచ్చే శారీరక మార్పులు, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 భాస్కర్ బాబు, సర్పంచ్ ఫాజిల్లా, ఎంపీటీసీ ఏసీ శేఖర్, హెచ్‌ఎం జయరామనాయుడు, జిల్లా ఓఎస్‌డీ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

కబ్జా చేయడం అధికార పార్టీకి సిగ్గుచేటు

- దోబీఘాట్ స్థల ఆక్రమణపై సీపీఐ మండిపాటు



దోబీఘాట్‌లో ఆక్రమణలను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి రూరల్: మండలంలోని వేదాంతపురం గ్రామ పంచాయతీ శ్రీ వెంకటేశ్వర ధోబీఘాట్‌ను అధికార పార్టీకి చెందిన కబ్జా చేసి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించి రజకులకే ఆ స్థలాన్ని కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన దోబీ ఘాట్ స్థలాన్ని సీపీఐ బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ, రజకుల వృత్తి పనులకు 2006లో ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వర దోబీ ఘాట్ నిర్మాణానికి 0.55 సెంట్ల స్థలాన్ని కేటాయించింది, ఈ స్థలాన్ని కబ్జా చేయడం అధికార పార్టీకి సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, జిల్లా విశ్వనాథ్, కే.రాధాకృష్ణ, పద్మ నాభరెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

'రోడ్ డాక్టర్'తో గుంతల పూడ్చివేత



రోడ్ డాక్టర్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగర పాలక సంస్థ పరిధిలో రోడ్లపై ఏర్పడిన గుంతలను రోడ్ డాక్టర్ యంత్రంతో త్వరగా పూడ్చవచ్చని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. గుంతల పూడ్చివేతకు ప్రత్యేకంగా తెచ్చిన ×రోడ్ డాక్టర్¥ పనితీరును బుధవారం కమిషనర్ పరిశీలించి మాట్లాడారు. ఈ యంత్రాన్ని సుమారు రూ.1.50 కోట్లతో కొనుగోలు చేశామని, దీనితో నగరంలో రోడ్ల గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చి ఆ మార్గాల్లో రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయడానికి అవకాశం కలిగిందన్నారు. ఈ యంత్రాన్ని సీసీ రోడ్లు, తారు రోడ్లు పూడ్చేందుకు వినియోగిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి తుడా: తిరుపతిలో ఈనెల 14, 15వ తేదీలలో నిర్వహించనున్న జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్సుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. సదస్సు వేదికైన రాహుల్ కన్వెన్షన్ సెంటర్, అతిథులు బస చేయనున్న హోటల్ గదులను పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, తుడా ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు ఉన్నారు.

15న కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికుల ధర్నా

- జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ల నేతలు

తిరుపతి కల్చరల్: ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దుర్మార్గమని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్‌తో ఈనెల 15న కలెక్టరేట్ వద్ద చేయతలపెట్టిన ధర్నాలో ఆటో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వివిధ కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల ఆటో కార్మికుల ఆధ్వర్యంలో ఆర్టీసీ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.శివ, సీఐటీయూ నేత వాసు, ఐఎఫ్‌టీయూ ఆటో యూనియన్ నేత విజయ్‌కుమార్ మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఆటో కార్మికుడికి రూ.15 వేలు ఇస్తామని, ఆటోల కొనుగోలుకు గ్యారంటీ లేని రుణాలు మంజూరు చేస్తామని, వాహనమిత్ర పథకం కల్పిస్తామని తదితర హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 15 నెలలైనా పట్టించుకోకపోవడం శోచనీయమని నిరసించారు. ఏఐటీయూసీ అనుబంధ ఆటో యూనియన్ నేతలు పురుషోత్తంరెడ్డి, ఏపీ.బాల, వెంకటేష్, సురేష్, ప్రమీల, సీఐటీయూ అనుబంధ ఆటో యూనియన్ నేత బాదుల్లా పాల్గొన్నారు.

కారు ఢీకొని యాచకురాలి మృతి

తిరుపతి క్రైమ్: రోడ్డు ప్రమాదంలో యాచకురాలు మృతి చెందిన సంఘటన తిరుపతిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం.. సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చి లక్ష్మీపురం వద్ద ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె యాచకురాలని తెలుస్తోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.